# పుట్టినరోజు కానుక

మరువాడ రాజేశ్వరరావు



**పో**తురాజుకి సబ్బు పెట్టి ఒక్కసారి మొహం కడుక్కోవా లనిపించింది. అప్పుడైతే మొహం తెల్లగా, శుభ్రంగా అందంగా ఉంటుందట. రోజూ సబ్బుతో తోముకుంటే అసలెంతో బాగుంటుంది. కాని, డబ్బు లేవీ! అందుకే కనీసం ఒఖ్ఖసారి...

కాని, ఒక్కసారి మాత్రం సబ్బెలా వస్తుంది? అమ్మ నడిగితే కసిరింది.

"నీ బోడి మొకాని కదొక్కటే తక్కువైందిరా. సుబ్బరంగా సదూకోరా అంటే...నువ్వు కూలోడి కొడుకువిరా, సబ్బులూ, పవడర్లూ మన క్కాదురా. గొప్పోళ్ళకి. నువ్వూ పెద్ద సదువులు సదివి గొప్పోడివైతే సబ్బులూ, పవడర్లూ కొందువులే. య్యెదవాలోచన్లు మాని సదుంకో" అని మందలించేడు నాన్న.

మందలింపులకీ, ప్రార్థనలకీ లొంగేది కాదు కోరిక! పోతురాజు పేచి పెట్టేడు. సబ్బుబిళ్ళ కొనకపోతే తిండి తిన్నని మొండికెత్తేడు. ఫలితం ... తండ్రిచేత చావుదెబ్బలు.

కోరిక తీరే ఆశ అంతరించింది. ఆశ అంతరించినా కోరిక చావలేదు.

మామూలుగా పుట్టిన కోరిక సహా

లంగా పెరుగుతూ వచ్చి, తన్నణచడానికి ప్రయత్నాలెక్కువౌతున్న కొద్దీ మరింత బలంగా పెరుగుతూ — చివరికి పోతురాజు మనసంతా ఆక్రమించుకొంది. నిరాశ, నిస్పృహా పూర్తిగా అవహించేయి. స్కూల్లో చదువుతున్నప్పుడు; పిలక మేష్టరు మొట్టికాయ మొట్టినప్పుడు; కోతికొమ్మచ్చి ఆడుతున్నప్పుడు; తిండి తింటున్నప్పుడు కూడా సబ్బు గురించి ఆలోచనలే.

'దేవుడా, ఒక్కసారి నన్ను సబ్బుతో తోముకునేలా చేస్తే నీ డిబ్బీలో మూడు నయాపైసలు వేస్తా'నన్నాడు.

కాని, వెంటనే దేవుడికి ఆ లంచం చాలదనే అనుమాన వొచ్చింది. అంతకంటె ఎక్కువ మొక్కుకోడానికి భయం. వడ్డీ వ్యాపారస్తుడేనా ఊరుకుంటాడు గాని, తన బాకీ చెల్లించకపోతే దేవుఁడు నిలువునా ప్రాణాల్తీస్తాడు. అలాంటి వాడితో లావాదేవీలు పెట్టుకునేప్పుడు కాస్త ముందు చూపు అవసరం.

'అంతే, అబ్బాయ్! నేను మూడు పైసలకి పైసా ఎక్కువివ్వను. నీ యిష్టవైతే నా కోరిక తీర్చు. లేపోతే నే మరో దారిచూసుకుంటాను' అన్నాడు దేవుడ్ని.

దుకాణాల్లో అందంగా అమర్చబడ్డ రంగు రంగుల సబ్బులు చూస్తున్నకొద్దీ ఏదో దిగులు, నిరాశ. తెల్లగా, శుభ్రంగా తళతళలాడే మొహాల్ని చూస్తున్నకొద్దీ ఈర్ష్య, బాధ. ప్రేమించిన పడతిని పొందలేక పోయిన ప్రియుడిలాగా బాధపడుతున్నాడు. పాపం పోతురాజు!

*  *  *

ఆ రోజుల్లోనే పోతురాజు పుట్టిన్రోజొచ్చింది. కనీసం పుట్టిన్రోజు నాడైనా సబ్బు పెట్టి ఒక్కసారి మొహం తోముకోవాలనుకున్నాడు. అమ్మనీ, నాన్ననీ అడగడానికి మనసొప్పలేదు. ఎలాగేనా సరే, 'తనే' ఓ అరణాలు సంపాయించి సబ్బు కొనుక్కోవాలి.

అందుకు మార్గం?

కష్టపడాలి. ఒక్కరోజు కష్టపడితే అరణాలు సులభంగా సంపాయించొచ్చు. ఒక్కరోజు కూలిపని చేస్తే...

వెంటనే మాసిన చొక్కా, లాగు వేసుకునికూలికోసం బైల్దేరేడుపోతురాజు

కూరల మార్కెట్ ...

వొచ్చేపోయే మనుషులు, కేకలు, బేరాలు తిట్లు, పలకరింపులు; గజ్జిక్కుక్కలు, ఈగలు; పారేసిన అరటితొక్కలు; అటూ ఇటూ పరుగెత్తే కూలివాళ్లు... వాళ్ళలో చేరెడు పోతురాజు.


మండుటెండలో నెత్తి మాడుతున్నా, కాళ్ళు కాలుతున్నా లెక్కచెయ్యక, చెమటలు కక్కుకుంటూ తిరిగేడు. దాహంతో పరితపిస్తూ, ఆకలితో అలమటిస్తూ పని 'కోసం' తిరిగేడు. పని 'చేస్తూ' తిరిగేడు. నీడలో నుంచొని బూతులు తిట్టే పెద్ద మనుష్యుల రాక్షసత్వాన్ని నిశ్శబ్దంగా భరించేడు ...

సాయంత్రమైంది. శివాజీ పార్కులో, పచ్చనిపచ్చికమీద పడుకొని చల్లగా వొచ్చే గాలిలోని హాయి ననుభవిస్తూ, ప్రశాంతతకి పరవశిస్తూ పగులంతా పడ్డ కష్టాన్ని తాత్కాలికంగా మరిచిపోయేడు.

ఆ తన్మయత్వాన్ని చాలాసేపనుభవించేక తనారోజు పడ్డశ్రమా, దాని ఫలితం గుర్తొచ్చేయి. రోజల్లా కష్టపడి పణ్ణాలు సంపాయించేడు. దానికోసం భరించిన ఆకలి, పడ్డశ్రమ, కాళ్ళపీకు, కళ్ళమంట, ఒళ్ళు నెప్పులు ...

ఎంత శ్రమపడితే నేం. సాధించేడు. పదణాలు పదులక్ష ల్రూపాయల కంటె ఎక్కువగా తోచేయి వాడికి.

అందులో అరణాలు పెట్టి సబ్బు ...



వెగటుగా తోచిందా ఆలోచన. ఆ రోజు తను పడ్డ శ్రమ విలువ, – ఒకసబ్బుబిళ్ళా! ఇంతేనా...

* * *

కష్టం తెలియని జీవి భోగాలాలసత్వం పెంచుకుంటాడు. కష్టపడకుండా సంపాయించిన డబ్బుని యిష్టం వచ్చినట్టు ఖర్చుపెట్టొచ్చు. కాని, కష్టార్జితానికి విలువ హెచ్చు. దాన్ని ఏదో మహత్తర కార్యానికే వినియోగించాలి. అందుకే పోతురాజుకి విలువైన కష్టఫలాన్ని సబ్బుకోసం ఖర్చుపెట్టే ఆలోచన వెగటుగా తోచింది.

ఆరోజు రాత్రి తన పుట్టినరోజు కానుకగా ఏడణాలిచ్చిన కొడుకుని చూసి ఆశ్చర్యపోయే డతని తండ్రి. "సబ్బుకోసం ఎంత కష్టపడ్డాడు పాపం!" అని జాలిపడ్డాడు.

"ఏరా, సబ్బు కొనియ్యనా? పాపం ఎంతకష్టపడ్డావురా. యెర్రెదవ" అంటూ ప్రేమగా పోతురాజు తలనిమిరేడు.

"సబ్బొద్దు నాన్నా. వాట్ని...నువ్వు దాచు...నాన్నా, మరే! అవెట్టి నువ్వే దేనా కొనుక్కో. నువ్వు రోజూ చాలా కష్టపడతావు. నువ్వెంతో మంచోడివి" అంటూ ప్రేమగా తండ్రి నంటిపెట్టుకుండిపోయేడు.

ఆ క్షణం, అటువంటి క్షణం, వాళ్ళెన్నడూ అనుభవించలేదు. పోతురాజు తండ్రి ఆ క్షణంలో చెప్పలేని ఆనందం పొందేడు. నిర్వచించలేని వాత్సల్యంతో నిండిం దతని మనసు.

తండ్రీ కొడుకు లిద్దరూ, ఎంతో సేపట్లా ఒకరినొకరు అంటిపెట్టుకుని ఉండిపోయారో వారికే తెలీదు. ★

